క్లుప్తంగా

లాభాల బాటలో బొమ్మనపల్లి సంఘం


మాట్లాడుతున్న రవీందర్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ ఆదర్శ పురుషుల పొదుపు సంఘం లాభాల బాటలో నడుస్తోందని సైదాపూర్ పొదుపు సమితి అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన 24వ వార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గణకుడు పెండ్యాల గురువయ్య సంఘం ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రవీందర్ మాట్లాడుతూ సైదాపూర్ పొదుపు సమితి పరిధిలోని 34 సంఘాల్లో రాయికల్, బొమ్మనపల్లి సంఘాలు మొదటి వరుసలో ఉన్నాయని అన్నారు. సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధ్యక్షుడు స్వామి, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న సతీశ్‌కుమార్

చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మతల్లి శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సోమవారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నోటీసులు


నోటీసులు ఇస్తున్న పోలీసులు

వీణవంక: వల్భాపూర్ గ్రామ ప్రధాన రహదారిపై ధాన్యం రాశులు పోసిన రైతులకు సోమవారం పోలీసులు నోటీసులు అందజేశారు. ట్రెయినీ ఎస్సై సాయికృష్ణ క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి ప్రమాదల తీరుపై వివరించారు. ధాన్యం రోజుల తరబడి రాశులు పోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే వాటిని తొలిగించాలని సూచించారు.

రోడ్డుపై యువకుడి స్కేటింగ్



శంకరపట్నం: హుస్నాబాద్‌కు చెందిన యువకుడు శంకరపట్నం మండలం కేశవపట్నం మీదుగా కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం కరీంనగర్‌కు స్కేటింగ్ చేస్తూ వెళ్లి పోయాడు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

సన్మానం


సన్మానిస్తున్న హనుమాన్ భక్తులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఆంజనేయమాలాధారణ భక్తులకు 41 రోజుల పాటు నిత్యం అన్నదానం చేసిన గుర్రం వెంకటేశం–వాణి దంపతులను సోమవారం ఆంజనేయస్వామి మాలాధారణ భక్తులు సన్మానం చేశారు.

సీతారామచంద్రస్వామి వెబ్‌సైట్ ప్రారంభం


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన అర్చకులు

హుజూరాబాద్ : పట్టణంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన తాత్కాలిక వెబ్ సైట్‌ను సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకుపల్లి శ్రీధర్ ఆచార్యులు, ఆలయ ధర్మకర్త యతిపతి అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈనెల 21న ఆలయంలో జరిగే ధ్వజస్తంభ పునః ప్రతిష్ట,ఉత్సవ విగ్రహాల ప్రాణప్రతిష్ట ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి రాక సందర్భంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యతిపతి సత్య దర్శన్, ముసిపట్ల శ్రీ చరణ్ తదితరులున్నారు.

విద్యుత్ తీగలు.. రైతులకు ఇబ్బందులు

- సరిచేయాలని అన్నదాతల ఆందోళన
- ప్రధాన రహదారుల వెంట అదే దుస్థితి
- ఇటీవల గునుకులకొండాపూర్‌లో తెగిన వైర్లు


హన్మాజిపల్లెలో లూజ్‌లైన్ల వద్ద రైతుల నిరసన

గన్నేరువరం: వ్యవసాయ భూముల్లో విద్యుత్ లూజ్‌లైన్లతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం మండలంలోని హన్మజిపల్లె గ్రామ రైతులు నిరసన వ్యక్తంచేశారు. లూజ్‌లైన్లు, ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. లూజ్‌లైన్లను సరిచేయాలని, ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారించుకుంటే విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టిడిస్తామని హెచ్చరించారు.

రహదారుల వెంట అంతే...

ప్రధాన రహదారుల వెంట లూజ్‌లైన్లు, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండలంలో కొనుగోలు కేంద్రాల నుంచి కరీంనగర్ వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ గునుకులకొండాపూర్ గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో తీగలు తెగి కింద పడ్డాయి. అప్పుడు ప్రమాదం తప్పింది. గన్నేరువరం నుంచి గుండ్లపల్లి స్టేజీ రాజీవ్ రహదారి వరకు గల రోడ్డు వెంట చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. రాత్రి పూట తీగలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కోతలు మొదలు గడ్డిను పశువుల పాకాల వరకు ట్రాక్టర్లలో తరలించే వరకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వ్యవసాయ భూములు, రహదారులు వెంట ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ప్రమాదకరంగా మారాయి.

విద్యుత్ తీగలు సరిచేయాలి



పొలాలు, రహదారి వెంట ఉన్న విద్యుత్ లూజ్‌లైన్లను అధికారులు సరిచేసి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా చూడాలి.
– గంగాధర తిరుపతి, మాదాపూర్

ఏర్పాటు చేస్తున్నాం



లూజ్‌లైన్లు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు చేపడుతున్నాం. ఖాసింపేట, పారువెల్ల గ్రామాల్లో 54 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్య పరిష్కారించాం. మిగతా చోట్ల సమస్య లేకుండా చూస్తాం. రహదారి వెంట విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ శాఖకు నోటీసులు ఇచ్చాం.
– ఆంజనేయులు, ఏఈ గన్నేరువరం

ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు సామర్థ్య నిర్మాణంపై శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈవో భూపతి శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదు రోజుల పాటు మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సామర్థ్య నిర్మాణంపై శిక్షణ కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. రిసోర్స్‌పర్సన్లు గాజుల ఆంజనేయులు, శ్రీనివాస్, ముశం సత్యరాజం, దానెంపల్లి శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, తంగేళ్లపల్లి శ్రీనివాస్, దోమల సదానందం, సాహెదా సల్మా పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి


ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: సైదాపూర్ ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌పై విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ ఏసీపీ శ్రీనివాస్‌జికి దళిత నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దళిత యువకుడు బత్తుల మహేందర్‌పై భార్గవ్ దాడి చేసి గాయపరచడమే కాకుండా దూషించాడన్నారు. నాయకులు తిప్పారపు సంపత్, రుద్రారపు రామచంద్రం, ఇంజం వెంకటస్వామి, మారపల్లి శ్రీనివాస్, రేణిగుంట్ల సాగర్, తునికి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత


లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం 57 మంది లబ్ధిదారులకు రూ.22,48,500 సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంచశీల జెండా ఆవిష్కరణ


రుక్మాపూర్‌లో జెండా ఎగరేసిన చర్మకారులు

చొప్పదండి: రుక్మాపూర్ శివారు లెదర్ పార్కు భూముల్లో చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంచశీల జెండా ఆవిష్కరించారు. బుద్ధ పౌర్ణమి వారోత్సవాలను పురస్కరించుకొని చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాత్తూరి రమేశ్ జెండా ఎగరేశారు. రుక్మాపూర్‌లో లెదర్ పార్కుకు కేటాయించిన భూమిలో పరిశ్రమలు స్థాపించి చర్మకారులను ఆదుకోవాలని కోరారు. బోయినపల్లి చంద్రయ్య, లింగంపల్లి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: మానకొండూర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్యానికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో రూ.13.50 లక్షల నిధులతో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించి, లింగాపూర్‌లో రూ.20లక్షలతో చేపట్టనున్న ఆరోగ్య ఉపకేంద్రానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రయోగశాల నూతన ఆవిష్కరణలకు వేదికగా మారాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్ర పనులు త్వరగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఓదెలు, రవీంద్రాచారి, తిరుమల్‌రెడ్డి, ప్రేమ్, మురళీధర్, మహేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి


శ్రీనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

గన్నేరువరం: ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గునుకులకొండాపూర్‌లో నల్లపోచమ్మ నాటక భజన మండలి సభ్యులు శ్రీనాథ్‌రెడ్డిని సోమవారం సన్మానించారు. ఇటీవల నాటక ప్రదర్శనకు తనవంతు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ న్యాలపట్ల కనుకయ్యగౌడ్, యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి హరీశ్, న్యాలపట్ల రమేశ్‌గౌడ్, నల్ల పోచమ్మ నాటక ప్రదర్శన అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల శంకర్‌గౌడ్, ముఖ్య సలహాదారులు కొర్వి కొమురయ్య, లింగంపల్లి అనిల్, ఆహ్వాన కమిటీ చైర్మన్ లింగంపల్లి తిరుపతి, భక్త బృందం భాస్కర్, చెన్నయ్య, కనుకయ్య, శంకర్, విజయ్, గంగారాజు, రమేశ్, ధర్మరాజు, బాలయ్య, రాములు, రవి, వీరేశం పాల్గొన్నారు.

రైతాంగ పోరాట యోధుడు సుందరయ్య


సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న కార్మికులు

చొప్పదండి: రైతాంగ పోరాటాలతో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కార్మిక లోకం ఉద్యమించాలని సీపీఎం ప్రజా సంఘాల కన్వీనర్ గంగిపెల్లి కుమార్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ నియంత్రణ చేసుకొని సమాజం కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కనుకయ్య, చంద్రారెడ్డి, శేఖర్, నాగభూషణం, క్రిష్టహరి, శంకర్, అశోక్, పెద్ది రవి, కనుకరాజు, రమేశ్, అంజయ్య, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట : జమ్మికుంటలో సీపీఎం మండల అధ్యక్షుడు శీలం అశోక్ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. సుందరయ్య బడుగు బలహీన వర్గాల ప్రజలు,శ్రామికుల కోసం త్యాగం చేశారన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు జక్కుల రమేశ్‌యాదవ్, వడ్లూరి కిశోర్, నాయకులు సిరికొండ మధునయ్య, మారపల్లి కిరణ్, తెడ్ల మహేందర్, చల్ల సాగర్, శ్రీనివాస్, రమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో విచారణ


విచారణ జరుపుతున్న అధికారులు

రామడుగు: మండలంలోని వెదిర ఐకేపీ ధాన్యం కొనుగోళ్లపై గ్రామ రైతులు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సోమవారం కొనుగోలు కేంద్రంలో అధికారులు విచారణ జరిపారు. ఐకేపీ కేంద్రంలో తూకం, నిర్వహణ, సౌకర్యాలు, బుక్ల నిర్వహణ గూర్చి సెంటర్ నిర్వహకులు తిరుపతిని అడిగి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

తలుపులు తొలగించి ఇంట్లో చోరీ


విచారణ చేస్తున్న పోలీసులు

శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో సోమవారం పట్టపగలు ఇంటి తలుపులు తొలగించి చోరీకి పాల్పడ్డారు. కేశవపట్నం గ్రామానికి చెందిన మేకల పరమేశ్ వ్యవసాయంతోపాటు సెంట్రింగ్ పనులు చేస్తాడు. ధాన్యం అమ్మిన డబ్బులను ఇంట్లో దాచి పెట్టి సోమవారం సెంట్రింగ్ పనులకు వెళ్లాడు. సాయంత్రం పనులు ముగించుకొని ఇంటికి రాగా.. ఇంటి తలుపులు తొలగించి ఉన్నాయి. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఇంట్లో దాచిన ధాన్యం డబ్బులు రూ.85వేలు దొంగలు దోచుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారమందించగా.. ట్రైనీ ఎస్సై సుమన్‌రెడ్డి, సిబ్బంది చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరిస్తున్నారు. నెల రోజుల క్రితం పరమేశ్ ఇంట్లో దొంగలు పడి రూ.5వేల నగదు, మోటార్ సైకిల్ బ్యాటరీ చోరీ విషయం విదితమే.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



తిమ్మాపూర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ గది నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, గవ్వ రాజేందర్‌రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, ఎస్.కొండల్‌రావు, మాచర్ల అంజయ్య, బుధారపు శ్రీనివాస్, పోలు రాము, రమేశ్, అట్ల అనిల్, సమద్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బుద్ధి ప్రసాదించాలని వినతి



శంకరపట్నం: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు కోడూరి సమ్మయ్య కేశవపట్నం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని.. ఎంపీడీవో వచ్చి ఇల్లు కట్టుకోమంటే పునాదులు తీశామని తెలిపాడు. తీరా ఇల్లు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం కేశవపట్నం రైతు వేదికలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి ఇంటిని మంజూరు చేయాలని వేడుకుంటే ఇల్లు మంజూరు చేయను, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమ్మని కోపంతో చూసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ వాలిసుగ్రీవ దేవాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై మొక్కులు చెల్లించారు.

రెండు గ్రామాల మధ్య చేపల గొడవ



ఇల్లందకుంట: చెరువులో చేపలు పట్టే అధికారం తమదంటే తమదని రెండు గ్రామాల ముదిరాజ్‌లు గొడవకు దిగారు. సోమవారం మల్యాల గ్రామ చింతల చెరువులో రామన్నపల్లి ముదిరాజ్‌లు చేపలు పట్టే క్రమంలో మల్యాల గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. మల్లాల పంచాయతీ నుంచి వాగొడ్డు రామన్నపల్లి వేరే గ్రామపంచాయతీగా ఏర్పడ్డప్పటి నుంచి వివాదం నడుస్తుందని ఆయా గ్రామాలకు చెందిన పలువురు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

జమ్మికుంట: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ తీగను తీగను గురుతుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని నాగంపేట గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 45 కిలోల కాపర్ వైరు చోరీకి గురైనట్లు వివరించారు. దీని విలువ రూ. 10 వేలు ఉంటుందని.. అసిస్టెంట్ ఇంజినీర్ సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు.

నేటి నుంచి శిక్షణ

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో నేటి నుంచి ఐదు రోజుల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి పావని తెలిపారు. ఎస్జీటీ ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

లక్ష్మీగణపతి ఆలయ గడప ప్రతిష్ఠాపన



తిమ్మాపూర్: అల్గునూరులోని లక్ష్మీగణపతి ఆలయ నిర్మాణంలో భాగంగా ప్రధాన ద్వారం కడప ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గిద్దె పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో పండితులు రామక శంకర శర్మ నేతృత్వంలో ఆంజనేయ స్వామి, భక్తుల సమక్షంలో పూజలు జరిగాయి. ఆంజనేయ స్వామి పూజారి శాంతన్ శర్మ సమక్షంలో పూజలు నిర్వహించారు. భజనలతో యాత్ర ప్రారంభమై, మహిళలు మంగళ హారతులు, పుష్పాలతో స్వాగతించారు. పెద్దమ్మ దేవాలయంలో టెంకాయ సమర్పించి, చౌరస్తా వద్ద ఆంజనేయ స్వామి, భక్తులు నత్యాలతో ఊరేగించారు. చావట్ల మైసమ్మ, శ్రీశివాజనేయ లక్ష్మీనర్సింసింహ, ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో టెంకాయలు సమర్పించారు. అనంతరం లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి చేతుల మీదుగా, బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ, శాంతన్ శర్మ, వేణు గోపాల శర్మ, శ్రీనివాస్, సత్తయ్యల సహకారంతో గడప ప్రతిష్ఠాపన జరిగింది.

క్రీడాకారులకు పండ్లు పంపిణీ



హుజూరాబాద్ : పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడాశిబిరం నిర్వహించారు. సోమవారం సహస్ర పబ్లిక్ స్కూల్ యాజామాన్యం క్రీడాకారులకు పండ్లు, గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి



రామడుగు: మండలంలోని వెలిచాల క్రాస్ రోడ్డు నుంచి సీపీఎం కళాశాల వరకు వీధి లైట్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరుచేయాలని వెలిచాల గ్రామానికి చెందిన యువకులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన వెంటనే సుడా నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారన్నారు. నిధులు మంజూరుపై యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం



రామడుగు: జేఎన్‌టీయూ అనంతపూర్ ఏపీ ఈ సెట్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన వెలిచాలకు చెందిన పెద్దిగారి రాకేశ్‌ను సోమవారం సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం సన్మానించారు. పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

హుజూరాబాద్: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారకులు కావద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి కోరారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై ధాన్యం నిల్వ చేయడంతో రాత్రివేళలో చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, సబ్ డివిజన్ పరిధిలో రైతులు కల్లాల వద్దే ధాన్యం ఆరబోయాలన్నారు. ఎవరైనా రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

ధాన్యం కుప్పలు తొలగించాలి

జమ్మికుంట: రోడ్లపై ఆరబోసిన ధాన్యం కుప్పలు తొలిగించాలని టౌన్ సీఐ రామకృష్ణ సూచించారు. కుప్పల, పరదాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కుప్పలు తొలగించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పనులు అడ్డుకున్న రైతులు

రామడుగు: ప్రభుత్వం పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు రామడుగు వంతెన మరమ్మతు చేపట్టాలంటూ సోమవారం పనులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలన్నారు.